పెద్దకథ

# రాజీ

వెల్లకూరు జయప్రద. సోమిరెడ్డి జమున

**మధ్యలో మరో స్టాప్- ఆ తర్వాత స్టాప్‌లో తను దిగాలి. చాలా ఆనందంగా వుంది శ్యామ్‌శేఖర్‌కు. అతను దేవాలయాల మీద రీసెర్చి ప్రారంభించాడీమధ్య. కాళహస్తి దేవాలయం చాల పెద్దదే అయినా, ఎంత ప్రయత్నిస్తున్నా ఇప్పటికిగాని అతనికి వీలు కాలేదు ఇక్కడికి రావడానికి.**

శ్యామ్‌శేఖర్ ఆనందం కాళహస్తీశ్వరుణ్ణి చూడబోతున్నందుకు కాదు. అక్కడేదో తను క్రొత్తగా కనిపెట్టబోతున్నందుకూ కాదు- ఆ చిన్న ఊరిలో తన స్నేహితులిద్దరున్నారు. ఒకరు తను ప్రీ-యూనివర్శిటీ చదివే రోజుల్లో క్లాస్‌మేట్ సుహాసిని. రెండవ వ్యక్తి యం. ఎ. ఆఖరి సంవత్సరంలో వున్నపుడు రూమ్‌మేట్ సురేంద్ర- ఇద్దరూ తనకు చాల ఆత్మీయులే.

పదహారు సంవత్సరాల వయసులో ఆకర్షణ కతీతంగా. సుహాసిని తననెంత అభిమానించేదో పాతిక సంవత్సరాల వయసులో బాధ్యతల మధ్యగా సురేంద్ర కూడా అంతే అభిమానించేవాడు. వాళ్ళిద్దరి అభిమానాల్ని, ఆత్మీయతల్ని మూటగట్టుకొని భద్రంగా ఈనాటికీ దాచుకొనున్నాడతను. తరచుగా క్షేమ సమాచారాలతో ఉత్తరాలు వాళ్ళ మధ్య జరుగుతున్నా ఒకరికొకరు చూసుకొని, మనసులు విప్పి మాట్లాడుకోవాలనే కోరిక వాళ్ళ మధ్య బలంగావున్నా. ఎవరి జీవితాలు వాళ్ళవి. ఆ బంధాలలోనుంచి బయటపడటం అంత సులభమైన విషయం కాదు.

మరలా బస్ బయలుదేరింది

సురేంద్ర ఎలా వున్నాడో! వాడు సమర్థుడు. తన జీవితాన్ని తనకిష్టమొచ్చినట్టు మలచుకునే వుంటాడు

"సుహాసిని ఎలా వుందో! ఎప్పటి మాట! తను ఆమెను చూసిఅప్పుడే ఎనిమిదేళ్ళయిపోయింది. ఆమెకు పెళ్ళయి కూడా అయిదేళ్ళయిపోయింది. చల్లగా. మనోహరంగా నవ్వే ఆమె నవ్వులో కొత్తగా పెద్దరికం చోటుచేసుకొనుండుంటుంది.'

తన ఆలోచనలకు తానే చిన్నగా నవ్వుకున్నాడు శ్యామ్‌శేఖర్. మరో గంటలో వాళ్ళను తను చూడబోతున్నాడు. కానీ చిత్రం. ఇన్ని సంవత్సరాలుగా లేని ఆతృత ఈ రోజు తన్ను కుదిపేస్తోంది.

అలా అనుకుంటూ తన ఆలోచనల్ని తను కంట్రోలు చేసుకోడానికి ప్రయత్నించే కొద్దీ అతన్ని పాత జ్ఞాపకాలు యింకా చుట్టేస్తున్నాయి.

"శ్యామూ! నీలాంటి వాణ్ణెవరినైనా చూసి మా సుహాసినికి తొందరగా పెళ్ళి చేయాలి!" అనేది గుప్తంగా సుహాసినీ వాళ్ళమ్మ.

"ఛీ! శ్యామూలాటి వాళ్ళనా-ఛస్తే చేసుకోను. శ్యామూ ఆ నల్లగానా! ఉహూఁ నేను చేసుకోబోయేవాడు చాల పచ్చగా వుండాలి. కనీసం ఐదూ పదకొండైనా హైట్ వుండాలి బలంగా. ఠీవిగా. దర్జాగా వుండాలి కార్లో తప్ప ఇక దేంట్లోనూ తిప్పకూడదు నన్ను" చాలా నిర్మొహమాటంగా చెప్పే కూతుర్ని విసుక్కునేది వాళ్ళమ్మ

"ఛీ! నోర్ముయ్ పది జన్మలెత్తితే మటుకు శ్యామూలాటి మంచి మనసున్నవాడు దొరుకుతాడా?"

"నో మమ్మీ. మొగుడనేవాడు మనం చెప్పేదంతా వినకూడదు- అలా వింటే జీవితం చప్పగా వుంటుంది. ఈ మధ్య నేనో నవల చదివి నీకివ్వలా గుర్తుందా! ఆ నవలలో హీరో చూడు భార్యను ఎంత ప్రేమిస్తాడో- అంత శాసిస్తాడు. ఆ డామినేటింగ్ నేచర్ చేసుకునేవాడిలో లేకపోతే భార్యకు బాగుండదు"

"చాల్లే-నిండా పదహారేళ్ళు లేవు అన్ని కబుర్లు చెప్తున్నావు"

"పదహారేళ్ళపుడేకదూ మమ్మీ పెళ్ళి గురించి ఆలోచించాలి" అని అల్లరిగా నవ్వే కూతుర్ని విసుగ్గా చూసేదామె.

"మమ్మీ! భర్తఅంటే ఎలా వుండాలంటే-చూడగానే కళ్ళతో పలకరించాలి. పెదాలు విచ్చుకోకుండానే నవ్వినట్లుండాలి. ఇక క్రాప్ దువ్వడంలోనే ఆ తలకు



అందం రావాలి టక్ చేయాలి. టై కట్టాలి వైట్ ప్యాంట్ – వైట్ షర్టు ఇన్‌షర్టుచేసి నిగనిగలాడే బూట్ లో ఓహ్ బెంగాలీ హీరోలా వుండాలి. నడక చాల సెయిల్‌గా వుండాలి. పేరు పిల్చుకోడానికి అనువుగా వుండాలి. అన్నిటికంటే ముఖ్యం ఆ అబ్బాయికి నా ప్రపంచంతప్ప వేరే వుండకూడదు...."

"ఏం మమ్మీ అలా అయిపోయావ్?"

"పెళ్ళి గురించి ఆలోచించొచ్చుగానీ కలలుకనడం మంచిదికాదే సుహాసినీ. ఇవి నవలలు కావు. ఎలా ఇష్టంవస్తే అలా

వ్రాసుకోడానికి. మన స్తోమతకి నీకు కారున్నవాడు. అందగాడు వస్తాడని కలలుకనడం ఆరోగ్యానికి మంచిది కాదు" అనేసి ఆమె లోపలికెళ్ళేది.

ఇంచు మించుగా అదే కాకపోయినా ఇలాటి వాగ్యుద్ధమే అప్పుడప్పుడూ అమ్మాకూతుళ్ళమధ్య జరుగుతూవుండేది. తను కేవలం శ్రోతలా మిగిలిపోయేవాడు. తనకీ సుహాసినిని పెళ్ళిచేసుకోవాలనే కోరిక లేకపోయినా తన స్నేహితురాలు తనని అలా కించపరచి మాట్లాడడం కాస్త బాధగానే వుండేది. మరలా ఆమె చూపే నిజమైన ఆప్యాయతలో అన్నీ మర్చిపోయేవాడు.

సుహాసిని ఎంత కలల్లో బ్రతికేదో అంత వివేకి కూడా. కొన్ని రోజుల తమ స్నేహం తర్వాత పనిలేనివాళ్ళు తామిద్దరి మధ్య అక్రమ సంబంధాన్ని అంటగట్టినపుడు.

"శ్యామూ ! నిన్ను నేను అన్నా ! అని పిలుస్తాను." అంటే తను నివ్వెరపోయాడు.

"అదేం ! అలా మన స్నేహానికి పేరు పెట్టకపోతే ఏం ?" అన్నాడు తను.

"తప్పదు శ్యామూ ! ఈ లోకానికి చెవులేకాని ఆలోచనా జ్ఞానం వుండదు. మనిద్దరి మధ్య వుండే స్నేహభావాన్ని అర్థం చేసుకునేంతగా వీళ్ళు ఎదగలేదు. అది కూడా వాళ్ళ తప్పు కాదు మన సమాజం అలా వుంది. 'అన్నా !' అని పిలిచి మన బాంధవ్యం ఇలాటిది అని వాళ్ళకి చెప్పుకోక తప్పడం లేదు."

"మాసారూ ! తప్పుకుంటారా ?" తృళ్ళిపడి చుట్టూ చూశాడు శ్యామ్ బస్ ఆగుంది. అది కాళహస్తి. నవ్వుకుని లేచి నిల్చొన్నాడు. బస్ అవతల తనని ఆహ్వానించడానికి కాళహస్తి దేవాలయం ధర్మకర్త. తప్పదు తను నేరుగా తన స్నేహితుల్ని కలుసుకోడానికి వీలులేదు మొదట వీళ్ళ ఆతిథ్యాన్ని తను స్వీకరించి తీరాలి. కొద్ది అయిష్టంగానే వాళ్ళతో కదిలాడు శ్యామ్.

## 2

"ఏమండోయ్ శ్రీవారూ ! లేవాలి మీరు ఈ రోజు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకం చేయించాలి-మీరు తల స్నానం చేసి అదిగో అక్కడ పట్టు పంచ పెట్టాను కట్టుకునీ___"

"అయ్యో ! ఆదివారం మీనా ఈ రోజు. ఎంచక్కా నీవు కూడా ఈ దుప్పట్లో దూరేయ్. ఆదివారం సార్థకమైపోతుంది. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సంగతి రేపు చూసుకుందాం లెద్దూ ! ప్లీజ్ "

"అయ్యో ! అవేం పాడు మాటలండీ

ప్రొద్దున్నే అసలే ఈ రోజు యంత్రాన్ని.."

"యంత్రమా ? ఏం యంత్రం మీనా.. ఓహ్ ! అప్పుడడిగే దానివిగా బట్టలుతికే మిషన్ - ఇన్‌స్టాల్‌మెంట్సు మీద కొనేశావేమిటి ?" లేచి కూర్చొన్నాడు సురేంద్ర.

"పోనీలే నీకు బట్టలుతికే బాధయినా తప్పుతుంది - అన్నట్లు మీనా ఇక ఆ పని కూడా లేదుగా ఇక చూడూ .... సరసకు రావే - సరదా తీరా...." తొడమీద తాళం వేస్తున్న భర్తను చిరుకోపంతో చూసింది మీనాక్షి.

"చాల్లెండి మీజోక్స్. అది బట్టలుతికే మిషన్ కాదు " అక్కడితో ఆ వాక్యం ఆపి గొంతు తగ్గించింది మీనాక్షి.


"మన పక్కవీధిలో రాజేశ్వరమ్మ లేరూ ! ఆమె నిన్న కంచి స్వాములవార్ని పాద పూజకు పిలిచింది. ఆయన ఆమెకో పెట్టెలో యంత్రం యిచ్చి దాన్ని పూజ గదిలో వుంచి పూజ చేయమన్నారట."

"ఆ యంత్రం ఖరీదెంతో ?"

"ఖరీదా ? ఏమో తెలీదు. అయినా అలాటి మహిమగలవాటికి ఎంతిచ్చినా తక్కువే అవుతుంది. మనమూ ఒకటి తెచ్చుకుందామండీ"

"నీకెందుకోయ్ వరాలు. అడిగే ప్రతి వరాన్నీ తీర్చే నీ దేవుడిక్కడుండగా" భార్యను లాక్కోబోయి ఘోరంగా పరాభవించబడ్డ పతిదేవుణ్ని జాలిగా చూస్తూ-

"తప్పండీ. అలా మాట్లాడకూడదు ఆ యంత్రానికి పూజచేస్తే మనింటికి ఏ దుష్టశక్తులూ రావట" అంది పరవశంగా మీనాక్షి. భార్య అమాయకత్వానికి సురేంద్రకు నవ్వొస్తోంది. తన భార్య బి. ఏ. "మనిల్లు మరీ ఇరుకుదేవీ ! ఆ దుష్ట



శక్తులు మనింట్లో మెలగలేవు. ఆ భయం నీ కక్కరలేదు."

ఈసారి మీనాక్షికి నిజంగానే కోపం వచ్చింది.

"అన్నీ వితండ వాదాలు లేచి స్నానం చేస్తారా? లేదా?" అంది విసుగ్గా

"అలాగే రాణీ! కానీ ఆత్మారాముడు తెగగోలపెడ్తున్నాడు. కాస్త కాఫీ ...."

"కాఫీయా! మతిపోతోందా? మీరు పూజ కెళ్తూ కాఫీ ఏమిటి? లేవండీ స్నానం చేద్దురుగానీ" మరలా ప్రతిమిలార్థంలోకి జారిపోయింది మీనాక్షి.

ఇక భార్యను కాదనే శక్తి సురేంద్రకు లేదు.

* * *

"మీనా! పట్టుచీర. కాసులపేరు. ఆ ముఖానికి పసుపులేకపోతే మీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుడిలోకి రానీడా ఏంటి?"

"అబ్బ! మీతో ఎలా! అయినా ఎన్ని సార్లు చెప్పాలి మీకు మధుర మీనాక్షిదేవి పేరును అలా 'మీనా' అని పిలవకూడదని."

"హతోస్మి."

సుబ్రహ్మణ్యస్వామి కోవెలలో అడుగు పెట్టేసరికి సురేంద్రకు ముచ్చెమటలు పోశాయి. వీళ్ళకంతా పూజ లెప్పుడయ్యేది. నేనింటి కెళ్ళి టిఫిన్ ఎప్పుడు తినేది అని....

"ప్రతి వారం పూజ పేర గుడికి వస్తుంటావు కదా! ఏదైనా స్పెషల్ రెకమెండేషన్ చేసి వాళ్ళనంతా వెనక్కునెట్టి నీవు మొదట అభిషేకం చేయించుకోలేవా?" దీనంగా అడిగాడు.

"నే నొక్కదాన్నేనా? వీళ్ళంతా కూడా ప్రతి వారం పూజ చేయిస్తారు.. రండి... రండి నవగ్రహాలకు ప్రదక్షిణం చేద్దాం."

"మరలా అదొకటా...."



కుమారి చాగంటి తులసికి ఆంధ్ర విశ్వవిద్యాలయం పి హెచ్.డి. పట్టా ఇచ్చింది హిందీలో ప్రసిద్ధ కవయిత్రి "మహాదేవి వర్మ కవిత్వంలో సౌందర్య భావన" అనే అంశంపై సిద్ధాంత పత్రాన్ని ఆమె సమర్పించారు.

కుమారి తులసి సత్యరౌత్రాయ్‌గారి ఒరియా కథలను తెలుగులోకి చేసి ఆంధ్ర జ్యోతి సచిత్ర వారపత్రిక ద్వారా పాఠకులకు సమర్పించారు ఈమె స్వతంత్రంగా రాసిన కథలు కూడా చాలా తెలుగు పత్రికల్లో వచ్చాయి. కుమారి తులసి సుప్రసిద్ధ కథా రచయిత శ్రీ చా. సో గారి కుమార్తె. ఈమె ప్రస్తుతం బరంపురం ఉమెన్స్ కాలేజీలో హిందీ లెక్చరర్‌గా ఉంటున్నారు

"మీ దేముడు భక్తులకు మంచి ఎక్సర్‌సైజ్ ఇచ్చాడే."

"హుష్ మాట్లాడకండి ప్రదక్షిణం చేసూ మాట్లాడొచ్చా!"

ఆ ఏడు అభిషేకం పేరుతో వంద రూపాయలు ఖర్చుపెట్టి తెచ్చిన సామగ్రి అంతా ఆ పూజారి దోసిట్లో పెట్టడం. సురేంద్ర మనసు ఉసూరుమనడం రెండూ జరిగిపోయాయి మనుష్యులే చిక్కటి పాలకు వాచిపోతే గుళ్ళో శిలకు చిక్కటి పాలు– చిక్కటి పెరుగుతో తలస్నానం చేయించేశారు. ఆ గర్భగుడిలో ఎంత మురికి పేరుకుపోయిందోగాని గుప్పున ముంజావసన ఒక్కమారు ఇంటిమేట్ సెంట్ స్ప్రే చేసినట్లు అంతా వెదజల్లింది. అసంకల్పితంగా జేబిలో చేతి గుడ్డ ముక్కుకు అడ్డం పెట్టేసుకున్నాడు సురేంద్ర.

భక్తులంతా అతిశ్రద్ధగా ఆ సువాసనలు పీలుస్తూ రెండు చేతులెత్తి స్వామి వారికి నమస్కరిస్తున్నారు. పూజారి ఆ పాలు – పెరుగు జవిరి. వాళ్ళు తెచ్చిన పాత్రలో నింపి రెండు ద్రాక్ష పళ్ళు. ఓ అరటి పండు అందులో కలిపి పంచామృతం పేర భక్తుల కందిస్తుంటే భక్తిపూర్వకంగా అందుకుంటున్నారు.

దేవుడికి అలంకారం చేయాలని స్క్రీన్ వేసేశారు. పాపం సురేంద్ర ఆత్మారాముడు గగ్గోలుపెట్టేస్తున్నాడు.

## 3

"అంటరానితనమే తరలిపోతున్న ఈ రోజుల్లో నీవు నీ మొగుణ్ణి అంటరాని వాడిలా చేసి ఆ కాఫీ అలా పడేసి వెళ్తున్నావ్ మీనాక్షీదేవీ!"

"ఈ రోజు ఉపవాసమండీ. మధ్యాహ్నం దేవుడి గదిలో భోంచేసేవరకు ఇంతే" అని వంటింట్లోకి తుర్రుమంది.

ఆదివారమంటే బ్రహ్మచారులకు చాలా ఇష్టం. తమిష్టమయినంతవరకు నిద్రపోవచ్చు. తర్వాత అలా మార్నింగ్‌షోకి వెళ్ళొచ్చు. ఆదివారం స్పెషల్ అయ్యర్ భోజనం తృప్తిగా తినొచ్చు. మధ్యాహ్నం మళ్లా ఓ నిద్ర. సాయంత్రం అందరు ఫ్రెండ్స్ కలిసి పేకాట లేదా అమ్మాయిలను చూస్తూ జంక్షన్‌లో అల్లరి కబుర్లు. ఇవీ బ్రహ్మచారి ఆనందాలు

పెళ్ళిచూపుల తతంగం మొదలయినప్పటినుంచి ఆలోచనా సరళి మారిపోతోంది.

"ఆఫీసకు టైమ్ అవుతుందండీ త్వరగా వంటచేయొద్దా" అనే భార్యను పడక దిగనివ్వకుండా తన చేతుల్తో బంధించేయొచ్చు.

తీరిగ్గా భార్యాభర్తలిద్దరూ ఒకే కప్పులో కాఫీ స్వీట్ కబుర్లతో పంచుకోవచ్చు. స్నానాల గదిలో నుంచి హడావుడిగా పరి



ఇటీవల మచిలీపట్నంలో జరిగిన రావి రంగారావు మినీ కవితల సంపుటి "గుడ్ మార్నింగ్" ఆవిష్కరణ సభలో కవి తన కావ్యాన్ని శ్రీ జి. వి. పూర్ణచందుకు అంకితమిచ్చిన దృశ్యం. మధ్య ఉన్నవారు శ్రీ నాగభైరవ కోటేశ్వరరావు.

గెత్తనక్కర లేకుండా సరసాలతో భార్య చేతులతో తలంటి పోయించుకోవచ్చు.

రోజూలా ఉడికీ ఉడకనిది వేడి వేడిగా గొంతు కాల్చుకుని తిని పరిగెట్టకుండా ఇద్దరూ కూర్చొని ఒకరికొకరం తిని పించుకుంటూ. తర్వాత తమలపాకులు భార్య నోటి కందిస్తుంటే భోజన ఘట్టాన్ని తనివితీరా ఆనందించొచ్చు.

సాయంత్రం స్వహస్తాలతో రోజా పువ్వు తెచ్చి భార్య చిన్న ముడిలో పెట్టి తన కోరిక మేర అలంకరించుకున్న తన భార్య గులాబి పెదాల మీద సుతారంగా ముద్దుపెట్టుకుని స్కూటర్ మీద. వెనుక భుజాల మీద భార్య చేతిని తీసుకుని గర్వంగా సినిమాకి వెళ్ళి రిజర్వుడ్‌లో కూర్చొని ఆనందించొచ్చు.

రాత్రి నును సిగ్గుతో కొత్త అందాలు పుణికి పుచ్చుకునే భార్యను తనివితీరా తన కౌగిట్లో కరిగించొచ్చు — కానీ పాపం సురేంద్ర ఆశలు ఒక్కటీ తీరనివ్వదు అదివారం భక్తిపేరిట మీనాక్షి.

"ఇద్దరం కలిసి కాఫీ త్రాగుదాం రా డియర్" అని సురేంద్ర పిలిస్తే "ఎంగిలండీ ఈ రోజు ఉపవాసంకదా!" అని పారిపోతుంది.

"మీనాక్షీ! అన్నం ఒకే కంచంలో వడ్డించెయ్ ఇద్దరికీ" శృంగారం ఒకపాలు ఎక్కువున్న సురేంద్ర కేక

"ఈపూట అరిటాకులో దేవునిగదిలో భోంచేయాలండీ నేను" సనాతన మూఢాచారాలకు ప్రతినిధి అయిన మీనాక్షి జవాబు.

"మీనా! వంటిల్లు సర్దడం ఇంకా కాలా-తమలపాకులు తీసుకుని రా."

"తమలపాకులు మీ రూమ్‌లో వుంచానండీ. వేసుకోండి. స్వాముల వారి దగ్గర తీసుకున్న యంత్రానికి జపం చేసుకుని వస్తాను" రూమ్‌లోకి రాకుండానే జవాబు.

ఇంతే సంగతులు - పాపం సురేంద్ర!

* * *

"సురేంద్రా!" వరండాలోనుంచి కేక విని. షేవ్ చేసుకుంటున్న సురేంద్ర రేజర్ క్రింద పెట్టి "వస్తున్నా" అంటూ వరండాలోకొచ్చాడు.

ఎదురుగా శ్యామ్‌శేఖర్ సూట్‌కేస్‌తో నిల్చొనున్నాడు.

"శ్యామూ! నువ్వు ఎప్పుడు రావచ్చావు?" ఇంచుమించు కౌగలించుకున్నాడు సురేంద్ర

"నేను ప్రొద్దున్నే వచ్చాను- సర్‌ప్రైజింగ్ విజిట్ యివ్వాలనే లెటర్ వ్రాయలేదు" అంటూ చేతిలో సూట్‌కేస్ క్రింద పెట్టాడు శ్యామ్‌శేఖర్.

"రారా లోపలికెళ్దాం" శ్యామ్ వారిస్తున్నా వినకుండా సూట్‌కేస్ తీసుకుని ఇంట్లోకి నడిచాడు సురేంద్ర.

"శ్యామూ! ముందు స్నానం చేసెయ్- ఇదిగో బాత్‌రూమ్. ఇంతలో నా షేవింగ్ పూర్తి చేస్తాను. తర్వాత కబుర్లన్నీ మనవే."

"ఆఁ ఇప్పుడు చెప్పు ఎన్నిరోజులుంటావు మావూర్లో?" అని. "మీనాక్షీ! ఇలా రా" కేకేసేడు సురేంద్ర. అప్పుడే పూజయినట్లుంది. ముఖాన పసుపు. పెద్ద కుంకుమ బొట్టు. పాపిటనిండా కుంకుమ. కాళ్ళకు పసుపుతో గబగబ వచ్చి కొత్త వ్యక్తిని చూసి పమిట భుజం నిండా కప్పుకుంది మీనాక్షి.

"వీడు నా బెస్ట్ ఫ్రెండ్ శ్యామ్‌శేఖర్- మన పెళ్ళికి రాలేదు- పి. హెచ్.డి. లో మునిగున్నాడు — ఈవిడ మా శ్రీమతి మీనాక్షీదేవి" అంటూ పరిచయం చేశాడు సురేంద్ర.

స్నేహితుడు ఏమయినా అనుకుంటాడనే ధ్యాసయినా లేకుండా తదేకంగా ఆమె వైపే చూస్తున్నాడు శ్యామ్‌శేఖర్.

'ఏమిటితను యిలా చూస్తున్నాడు. ఈయన స్నేహితునికి ఇంత సభ్యత తెలీదా!' అని విసుక్కుంటూ ఆశ్చర్యపోయింది మీనాక్షి.

అతని కనుగుడ్ల చలనం క్షణంసేపు ఆగిపోయింది. అతని ఆలోచనలు వేగంగా వెనక్కి వెళ్ళిపోయాయి.

[ఇంకా వుంది]

